క్లుప్తంగా

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం



కుట్టు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

భీమునిపట్నం: పేద యువతులు, మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణను స్థానిక కలిగొట్ల స్విగ్గ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మహిళల స్వయం ఉపాధి కోసం శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇప్పటికి ఎనిమిది శిబిరాలు నిర్వహించామని, తద్వారా శిక్షణ పొందిన వారు ఆర్థికంగా బాగున్నారన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. శిక్షణ పొందాలని ఆసక్తి ఉన్న మహిళలు 9643222666లో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



సాయితేజ

పీఎం పాలెం: ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన ఇజ్జ గోపికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కొడుకు సాయితేజ (17) మారికవలసలోని ఓ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. వినాయక చవితి సందర్భంగా సెలవులు ఇవ్వగా ఈ నెల 16న స్వగ్రామం వెళ్లాడు. మరలా 22న ఉదయం మారికవలస కాలేజీకి బయలుదేరినా కళాశాలకు వెళ్లలేదు. దీంతో సాయితేజ కళాశాలకు రాలేదని యాజమాన్యం నుంచి విద్యార్థి తండ్రికి సమాచారం అందడంతో అన్నిచోట్లా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

దేశంలో అన్నిరంగాల అభివృద్ధి



బీజేపీ జెండా ఎగుర వేస్తున్న రవి కుమార్

పద్మనాభం: బీజేపీ మండల కార్యాలయంలో గురువారం ప్రవాస యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్ పార్టీ జెండా ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశంలో సుపరిపాలన సాగుతుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలోని అన్ని రంగాలను అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. మండల శాఖ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, హెచ్.మహేష్ పాల్గొన్నారు.

కోలాహలంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న కరస్పాండెంట్ నరసింగరావు

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణా జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఉత్సాహంగా జరుపుకున్నారు. కేరింతలు, ఆటపాటలతో బొగ్గురోడ్డులోని కళాశాల ఆవరణ సందడిగా మారింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గత ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను శ్రీకృష్ణా విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.నరసింగరావు ప్రోత్సాహకాలు, నగదు బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.రాజేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ తాతారావు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఆనందపురంలో లబ్ధిదారులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : అధికారం కోసం కొంతమంది రాజకీయం చేస్తే... ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రం పదవులు కంటే పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఉత్సాహంగా ఎమ్మెల్యేకు ఎదురేగి హారతులు పట్టారు. ప్రతి కుటుంబానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించిన వివిధ రకాల సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజాభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి వినూత్నంగా పథకాలు అమలు పరుస్తున్నారని వివరించారు. ముఖ్యంగా కొత్తగా అమలు పరుస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంగా మారిందన్నారు. గతంలో వ్యాధి తనిఖీ కోసం మండల కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేదని... ప్రస్తుతం ఈ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దనే అన్ని రకాల వైద్య సేవలు అందుతుండడం దేశంలోనే గొప్ప విషయమని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ద్వారా సేవలు అందుతున్నా ఇంకా సమస్యలు ఉంటే వాటిని నేరుగా తెలుసుకొని పరిష్కరించడానికే తమను ఇంటింటికీ సీఎం జగన్ పంపిస్తున్నారని చెప్పారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ ఫలాల లబ్ధిని నేరుగా ప్రజలకే అందించే దేశంలోనే ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమని గుర్తు చేశారు. భావితరాల భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని మరలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని, అందరూ ఆయనను ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులను, పార్టీలను నమ్మవద్దని హితవు పలికారు. సర్పంచ్ చందక లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, ఎంపీడీవో అడపా లవరాజు, నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, బీఆర్‌బీ నాయుడు, చందక అప్పలస్వామి, రౌతు వెంకటరావు, చెన్నా సత్యం, పడాల రాము, ఇల్లాపు వెంకటరావు, షిణగం రామారావు, డీవీ నారాయణ పాల్గొన్నారు.

ఫ్యాబ్ సేవలు అభినందనీయం



సిమెంట్ బెంచీలు ప్రారంభిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) సభ్యులు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. ఫ్యాబ్ ఆధ్వర్యంలో బీచ్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన 23 సిమెంట్ బెంచీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాబ్ సభ్యుల సేవా కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో మంచి జరుగుతోందన్నారు. ఫ్యాబ్ ప్రతినిధి ముసునూరి సూర్య శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం 23 బెంచీలు ఏర్పాటు చేయగా ఇప్పుడు అదే సంఖ్యలో మళ్లీ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం జెడ్సీ రామును ఘనంగా సత్కరించారు. సీనియర్ న్యాయవాది ఎస్.జనార్దన్‌రావు, ఫ్యాబ్ సభ్యులు కాళ్ల సన్నీ, విజ్జపు సత్యనారాయణ, కందివలస నరేంద్రకుమార్, కట్టమూరి అశోక్, డాక్టర్ కాళ్ల లావణ్య, మారోజు గోపి, దేవానంద్, మొకర శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ



కొమ్మాది: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 8వ వార్డు భువనేశ్వర్ కాలనీ క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన దీపాలంకరణ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా 1001 దీపాలతో స్వస్తిక్, ఓం, శంఖు, చక్రాల రూపాలను అలంకరించి దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



భీమిలిలో ర్యాలీలో ముస్లింలు

భీమునిపట్నం: మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ వేడుకలను భీమిలిలో గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక జామీయా మసీద్ నుంచి చిన్న బజార్, కాళ్ల వీధి, పెద్ద బజార్, గంట స్తంభం మీదుగా ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలు, మౌల్వీలు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమన్నారు. మిలాద్-ఉన్-నబీ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ అన్వర్ హుస్సేన్, షేక్ అబ్దుల్ నయాం, షేక్ మతీన్, షేక్ యాసీన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మధురవాడ శివశక్తినగర్ రోడ్డులో గల సద్గురు సాయినాథ కాలనీలోని మసీద్ ఏ ఫిర్‌దౌస్‌లో, కొమ్మాది కూడలిలోని మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలమ్, మస్తాన్, ఎమ్‌డీ అహమ్మద్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

బాలలకు దుస్తుల పంపిణీ



యోగా దుస్తులతో బాలలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రం బాలలకు లక్ష్మీ విజయ ఆస్పత్రి వైద్యులు రామభద్రరాజు, రమ్య రూ.20 వేల విలువైన యోగా దుస్తులు గురువారం అందించారు. అనంతరం భోజనాలు పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడి చిన్నారులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించనున్నట్టు హామీ ఇచ్చారు. వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఊరూరా 'జగనన్న సురక్ష' సర్వే

- అందరి ఆరోగ్య వివరాల సేకరణ
- 30 నుంచి వైద్య శిబిరాల నిర్వహణ



మారికవలసలో ఆరోగ్య సర్వే చేస్తున్న ఏఎన్ఎమ్‌లు, వలంటీర్లు



మధురవాడ పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

ఆనందపురం : అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నియోజకవర్గంలో ఊరూరా ఉద్యమంలా సాగుతోంది. ఆరోగ్య సిబ్బంది దండులా కదిలి గ్రామాలను సందర్శించి రోగులకు వైద్య సేవలు అందిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైద్యుల వద్దకు రోగులు వచ్చి సేవలు పొందేవారు. దీంతో కాలయాపన జరిగి సరిగ్గా వైద్యం అందని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అందుకు భిన్నంగా వైద్య సేవలు అందుతున్నాయి. రోగుల ఇంటికే వైద్యులు వచ్చి సేవలు అందించడం గొప్ప విశేషంగా ప్రజలు చెప్పుకుంటున్నారు.

10 రోజుల్లో 16 వేల మందికి తనిఖీలు

ఆనందపురం మండలంలోని ఆనందపురం, వేములవలస, గంభీరం, పాలవలస, తర్లువాడ, చందక, గొట్టిపల్లి, కుసులువాడ, బోని, గిడిజాల సచివాలయాల పరిధిలో ఈ నెల 16 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతోపాటు సుమారు 80 మంది సర్వేలో పాల్గొంటున్నారు. పది రోజుల్లో 5,227 ఇళ్లను సందర్శించారు. 16,598 మందిని తనిఖీ చేసి ఆరోగ్య వివరాలు సేకరించారు. అందులో 130 మందికి క్షయవ్యాధి లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. సర్వేలో గుర్తించిన రోగులకు ఈ నెల 30 నుంచి ప్రత్యేక వైద్య నిపుణులతో సచివాలయాల్లో నిర్వహించనున్న వైద్య శిబిరాలలో సేవలు అందిస్తారు. ఇంకా ప్రమాదకర పరిస్థితిలో ఉన్న రోగులకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా మెరుగైన వైద్యం అందించడానికి పెద్దాస్పత్రులకు తరలిస్తారు.

వైద్య శిబిరాల షెడ్యూల్ ఇదీ

ఆరోగ్య కేంద్రం పరిధి	తేదీ	శిబిరం నిర్వహించే ప్రదేశం
మధురవాడ పీహెచ్‌సీ	ఈ నెల 30	మధురవాడ పీహెచ్‌సీ వద్ద
వాంబేకాలనీ యూపీహెచ్‌సీ	అక్టోబర్ 03	వాంబేకాలనీ
సాగర్‌నగర్ యూపీహెచ్‌సీ	అక్టోబర్ 5	సాగర్‌నగర్
మారికవలస యూపీహెచ్‌సీ	అక్టోబర్ 11	మారికవలస, ఆర్‌జీకే కాలనీ
పీఎంపాలెం యూపీహెచ్‌సీ	అక్టోబర్ 17	అవంతి ఫంక్షన్ హాలు
మిథిలాపురి యూపీహెచ్‌సీ	అక్టోబర్21	గాంధీ విగ్రహం సమీపంలో
రుషికొండ యూపీహెచ్‌సీ	అక్టోబర్ 26	రుషికొండ
స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీ	అక్టోబర్ 27	గణేష్‌నగర్, ఏఎస్‌ఆర్ పార్కు
బక్కన్నపాలెం యూపీహెచ్‌సీ	అక్టోబర్ 28	కొమ్మాది, గాయత్రి నగర్

యూపీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాలు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లో భీమిలి నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) పరిధిలో ఈ నెల 14 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభించారు. సర్వేను జోనల్ కమిషనర్ సహా ఇతర అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించిన తర్వాత వైద్య నిపుణులతో మెగా వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

85 శాతం సర్వే పూర్తి

మధురవాడ పీహెచ్‌సీ పరిధిలోని 7 వార్డు సచివాలయాల్లో 85 శాతం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పూర్తయింది. ఏఎన్ఎమ్, ఆశ, ఇతర ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు సర్వే చేస్తున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. ఈ నెల 30న పీహెచ్‌సీ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నాం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి

– ప్రశాంతి, వైద్యాధికారి, మధురవాడ పీహెచ్‌సీ.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో జీవీఎంసీ నిధులు రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ లొడగల అప్పారావు గురువారం శంకుస్థాపన చేశారు. గతంలో ఈ ప్రాంతలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు ఇక్కడి సమస్యలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు నిధులు మంజూరవడంతో పనులు ప్రారంభించినట్లు అప్పారావు తెలిపారు. వార్డులో ఎన్నడూ లేని విధంగా అభివద్ధి జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, జేసీఎస్ వార్డు ఇన్‌చార్జి ఉప్పులూరు గోపి, స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమా మహేశ్వరరావు, నొడగల రాంబాబు, మాదు చంటి, బొబ్బిలి చిన్న, అప్పలస్వామి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల్లో అంతరిక్ష పరిశోధనలకు ఇస్రో సహకారం



ఇస్రో శాస్త్రవేత్త ప్రదీప్ కుమార్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: విద్యార్థులు, యువ పరిశోధకులు చంద్రయాన్ వంటి అంతరిక్ష ప్రయోగాల నుంచి స్ఫూర్తిని పొందుతున్నారని, వారిని ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయాల్లో శాస్త్ర పరిశోధనలకు ఇస్రో సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని ఇస్రో అట్మాస్ఫియరిక్ అండ్ స్పేస్ సైన్స్ ఏవియానిక్స్ చెక్ అవుట్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్, ఇఇసీఇ విభాగం సంయుక్తంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని వివిధ దేశాలు వందకుపైగా అంతరిక్ష ప్రయోగాలు జరిపినప్పటికీ చంద్రుడిపై నీటి జాడలు గుర్తించిన ఘనత భారత్‌కు మాత్రమే దక్కిందన్నారు. ఈ ఏడాది రష్యా, జపాన్ తదితర దేశాలు చేసిన ప్రయోగాలు విఫలం కాగా ఇస్రో చంద్రయాన్ విజయం సాధించడం వెనుక వైఫల్యాల నుంచి నేర్చుకున్న పాఠాలు కారణమన్నారు. భారత అంతరిక్ష ప్రయోగాలు విజయవంతం కావడంతో ఇతర దేశాలు సహకారం కోరతూ ముందుకు వస్తున్నాయని, తద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక వనరులు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతం డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ శిక్షణకు 115 మంది విద్యార్థులు



చిట్టివలసలో శిక్షణకు హాజరైన విద్యార్థులు

తగరపువలస: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ – 2024 ఉచిత శిక్షణకు గురువారం చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వివిధ పాఠశాలల నుంచి 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సాగుతున్న ఉచిత శిక్షణకు కేఎల్ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసి ప్రస్తుతం బొగ్గు రోడ్డు సచివాలయంలో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న పందిరి శివకుమార్ హాజరయ్యారు. ఆయన విద్యార్థులకు భౌతిక శాస్త్రంలో హీట్ అండ్ టెంపరేచర్ అభ్యసనలో మెలకువలు తెలియజేశారు. అనంతరం శివకుమార్‌ను సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, టీచింగ్ ఫ్యాకల్టీ పక్కి నాగేశ్వరరావు, యాగాటి వెంకటరమణ, శ్రీను సత్కరించారు.

వైద్యుల సేవాతత్పరతకు చిహ్నం వైట్‌కోట్



వైట్‌కోట్ ఉత్సవంలో సంగివలస అనిల్ నీరుకొండ వైద్య కళాశాల విద్యార్థులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు వైట్‌కోట్ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జి.శాంతారావు మాట్లాడారు. వైట్‌కోట్ ధరించడం అనేది వైద్యవృత్తికి, వారి సేవా తత్పరతకు చిహ్నమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చరక సంహిత ప్రమాణం చేయించారు. నిజమైన సేవకునికి జీవితాంతం సేవ చేసే భాగ్యం కలుగుతుందన్నారు. అనంతరం అనాటమీ డి సెక్షన్‌లో క్యాడవర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ సుజాత రత్నకుమారి, ఏవో శివప్రసాద్ పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద అన్నదానం



గొల్లల తాళ్లవలసలో అన్నదానం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ తదితరులు



శేరిఖండంలో అన్నదానం ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల



లక్ష్మీవానిపాలెంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

తగరపువలస: గణపతి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలుచోట్ల అన్నదానాలు చేశారు. జీవీఎంసీ ఒకటో వార్డు వెలంపేట బంతాట మైదానం వద్ద నిర్వాహకులు భారీ అన్నసమారాధన చేశారు. భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ గొల్లల తాళ్లవలసలో భారీ అన్నసంతర్పణను ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎలమంచిలి అప్పలరాజు, అక్కరమాని అప్పలనాయుడు, కిలారి వెంకటరావు, ఎలమంచిలి శ్రీనివాసు, బర్ల రమణ, కిలారి రమణ, అక్కరమాని ఆదినారాయణ, అయితి బంగారునాయుడు, కొంగరాని వేణు, ఎలమంచిలి అప్పలనాయుడు, కిలారి నారాయణరావు, అయితి అప్పలరాజు, ఎలమంచిలి మురళీకృష్ణ పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని శేరిఖండంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గురువారం మూడు వేల మందికి అన్నదానం చేశారు. ఈ అన్నదానాన్ని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లంటి చిన్నారావు, నమ్మి వెంకటరావు, వాడపల్లి సురేష్, పద్మనాభ యువజన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం లక్ష్మీవానిపాలెంలో స్థానిక గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన చేశారు.

గాయత్రినగర్, ఆర్‌హెచ్ కాలనీలకు చెందిన సుమారు ఐదువేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్టపై ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. జమ్ము చిన్నా అనే వ్యక్తి బైక్ చోరీకి గురవడంతో బాధితుడు భీమిలి పోలీసులను ఆశ్రయించాడు.

భగత్‌సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకం

తగరపువలస: దేశంలోని యువకులంతా భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ప్రతినిధులు సూచించారు. గురువారం భగత్‌సింగ్ 117వ జయంతిని పురస్కరించుకుని స్థానిక సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.శ్రీనివాసవర్మ మాట్లాడుతూ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటంలో సుఖ్‌దేవ్, రాజ్‌గురుతో కలిసి భగత్‌సింగ్ బ్రిటీష్ వారి కుట్రలకు బలయ్యారన్నారు.

చురుగ్గా మండల పరిషత్ భవన నిర్మాణం



మండల పరిషత్ కార్యాలయం కోసం నిర్మిస్తున్న భవనం

భీమునిపట్నం: భీమిలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్త భవనం నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఇక్కడ గతంలో ఉన్న భవనం దెబ్బతిన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటికే సమావేశ మందిరం విడిగా ఏర్పాటు చేశారు. అలాగే ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో హెచ్‌పీసీఎల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.40 లక్షలు మంజూరు చేసింది. దీంతో పాత భవనాన్ని కూల్చివేసి అన్ని సదుపాయాలతో కొత్త భవన నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. ఇది పూర్తికావడానికి మరి కొంత నిధులు అవసరం ఉండడంతో త్వరలో ప్రభుత్వ పరంగా మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే భవనం పూర్తయి అందుబాటులోకి రానుందని, కార్యాలయ నిర్వహణ సులభతరంగా మారనుందని అధికారులు పేర్కొన్నారు.